మెడికల్ హబ్ దిశగా..



» జిల్లాలో ఇప్పటికే కొనసాగుతున్న మెడికల్ కాలేజీ » అనుబంధంగా ప్రారంభమైన నర్సింగ్ కాలేజీ » అందుబాటులోకి రెండు పారా మెడికల్ కోర్సులు » ట్రాన్స్‌జెండర్‌ల కోసం స్పెషల్ క్లినిక్ » ఇక రోగులకు చేరువలో సూపర్ స్పెషాలిటీ వైద్యం » రోగులకు తీరనున్న వైద్య కష్టాలు

నిర్మల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాజకీయంగా, సామాజికంగా ముందు వరుసలో నిలుస్తున్న జిల్లా ఇక క్రమంగా మెడికల్ హబ్ దిశగా అడుగులు వేస్తోంది. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తుండడంతో ఇక్కడ ప్రజల ముంగిట్లోకి మెరుగైన వైద్యసేవలు నిలుస్తున్నాయి. గతంలోనే జిల్లా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించడమే కాకుండా పలువురు స్పెషలిస్టు వైద్యులను నియమించి మెరుగైన సేవలను అందిస్తున్నారు. ఈ క్రమంలోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ కాలేజీలో మొదటి సంవత్సరం కోర్సు పూర్తి కాగా ప్రస్తుతం రెండో సంవత్సరం కోర్సులు మొదలయ్యాయి. మెడికల్ కాలేజీ ఏర్పాటుతో వివిధ విభాగాలకు ప్రొఫెసర్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు నియమింపబడ్డారు. వీరంతా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉన్న జిల్లా ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలను అందిస్తున్నారు. కాగా ఈ మెడికల్ కాలేజీకి అనుబంధంగా నర్సింగ్ కాలేజీని కూడా ఏర్పాటు చేశారు. మొత్తం మూడు సంవత్సరాల నర్సింగ్ కోర్సుకు 60 సీట్లు అందుబాటులోకి వస్తున్నాయి. దీనికి తోడుగా రెండు పారా మెడికల్ కోర్సులను ప్రవేశపెట్టారు. డిప్లొమా ఇన్ ఈసీజీలో 30 సీట్లు, డిప్లొమా ఇన్ స్టెరిలైజేషన్‌లో 30 సీట్లను కేటాయించారు. ఈ రెండు కూడా మెడికల్ కాలేజీలో కొనసాగనున్నాయి. దీని కారణంగా ఇక్కడి ప్రజలకు హైదరాబాద్ నిజామాబాద్ లాంటి నగరాలకు వెళ్లి వైద్య చికిత్సలు జరుపుకునే అవసరం లేకుండాపోయిందంటున్నారు. అన్ని రకాల స్పెషలిస్టు డాక్టర్‌లు అందుబాటులో ఉన్న కారణంగా రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు ఇక్కడే అందుతున్నాయి.



ఇప్పటికే డయాగ్నోస్టిక్ హబ్, డయాలసిస్ సెంటర్‌లు

కాగా ఇక్కడి జిల్లా ఆసుపత్రిలో ప్రస్తుతం డయాగ్నోస్టిక్ హబ్ కొనసాగుతోంది. దీని కారణంగా అన్ని రకాల వ్యాధులకు ఈ డయాగ్నోస్టిక్ హబ్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒకేసారి రక్తం, మూత్రంతో అనేక వ్యాధులకు సంబంధించిన రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న కారణంగా ప్రతి రోజూ చాలా మంది ఇక్కడే పరీక్షలు జరుపుకుంటున్నారు. దీనికి తోడుగా పది పడకలతో కూడిన డయాలసిస్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. డయాలసిస్ సెంటర్‌లో స్లాట్ సిస్టం ద్వారా రోగులకు సేవలు అందిస్తున్నారు. అలాగే ఈసీజీ, సిటిస్కాన్ లాంటి సౌకర్యాలు కూడా ఇక్కడ అందుబాటులో ఉంటున్న కారణంగా పేద రోగులకు అనేక రకాల ప్రయోజనం దక్కుతుందని అంటున్నారు. వీటితో పాటు ట్రామా కేర్‌సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ట్రామా కేర్ సెంటర్ ద్వారా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారు. ఇలా అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో పేద రోగులకు ఆర్థికభారం తప్పుతోందని చెబుతున్నారు.

ట్రాన్స్‌జెండర్‌ల కోసం స్పెషల్ క్లినిక్..

ఇదిలా ఉండగా ఇప్పటి వరకు ఎక్కడ లేని విధంగా జిల్లా ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్‌ల కోసం ప్రత్యేక క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్లినిక్‌లో ముగ్గురు స్పెషలిస్టు డాక్టర్‌లను నియమించారు ఓ ఫిజీషియన్‌తో పాటు డర్మటాలాజిస్ట్ అలాగే సైకాలజిస్టులను నియమించారు. జిల్లాలో మొత్తం 38 మంది ట్రాన్స్‌జెండర్‌లున్నట్లు గుర్తించిన వైద్యశాఖ వీరికి వారంలో రెండు రోజుల పాటు మంగళ, బుధవారాల్లో ప్రత్యేక వైద్యసేవలు అందించనున్నారు. కాగా ప్రైవేటులో కూడా ట్రాన్స్‌జెండర్‌లకు సరియైన వైద్యసేవలు అందించే సౌకర్యం లేకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ఆసుపత్రుల్లో ఈ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. ఇటీవలే జిల్లాలో కలెక్టర్ అభిలాష అభినవ్ ట్రాన్స్‌జెండర్ ప్రత్యేక క్లినిక్‌ను ప్రారంభించారు.

ఖాళీలను భర్తీ చేస్తే మరింత సౌకర్యం

కాగా ఇక్కడి మెడికల్ కాలేజీలోనూ, జిల్లా ఆసుపత్రిలోనూ ఖాళీలను భర్తీ చేస్తే రోగులకు మరింత మెరుగైన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయంటున్నారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీలో పలు ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉండడంతో బోధనకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని చెబుతున్నారు. ఫోరెన్సిక్ విభాగంలో ప్రొఫెసర్‌ల కొరత ఉందని అలాగే మొదటి సంవత్సరం మెడికల్ విద్యార్థులకు బోధించే ప్రొఫెసర్‌ల సంఖ్య కూడా తక్కువగా ఉందని, ఇక్కడ ప్రొఫెసర్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల నియామకాలను వెంటనే నియమిస్తే ఇటు మెడికల్ విద్యార్థులకు అటు జిల్లా ఆసుపత్రి రోగులకు మరిన్ని వైద్య సేవలు అందించే అవకాశం ఉందంటున్నారు. కాగా మెడికల్ కాలేజీలో వివిధ రకాల 52 పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే ప్రక్రియ కూడా మొదలైంది. ఈ పోస్టుల నియామకాల కోసం ఇటీవలే దరఖాస్తులు కూడా స్వీకరించారు.



బాసరలో మూల నక్షత్ర పూజలు



బాసర ఆలయంలో మూలనక్షత్ర పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

బాసర, డిసెంబరు, 3 : (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ ఆలయంలో మంగళవారం మూల నక్షత్ర పూజలు నిర్వహించారు. ప్రతినెల జరిగే పూజలు నిర్వహించిన ఆలయ పండితులు ఆ కార్యక్రమంలోనే విజయోత్సవ పూజలను కొనసాగించారు. అమ్మవారి ఉత్సవ మూర్తులకు కుంకుమార్చన జరిపారు. బుధవారం కూడా విజయోత్సవాల కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో విజయ రామరావు తెలిపారు. విజయోత్సవాల సందర్భంగా బాసర సరస్వతి అమ్మవారి ఆలయానికి రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలలో భాగంగా బాసరలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి.

ఆ రెండు పనుల్లో అంచనాల కంటే తక్కువనే ఖర్చు చేశాం

● బాసర ఆలయ ఈవో విజయ రామరావు

బాసర, డిసెంబరు, 3 : (ఆంధ్రజ్యోతి) : దసరా వేడుకల్లో ఈ సారి క్యూలైన్లు, విద్యుత్ దీపాల అలంకరణ ఖర్చులో అంచనాల కంటే తక్కువ ఖర్చు చేశామని ఆలయ ఈవో విజయరామరావు తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'బాసర ఆలయంలో అవినీతి మరక' వార్తకు వివరణ ఇచ్చారు. విద్యుద్దీపాల అలంకరణకు ఇంజనీరింగ్ అధికారులు 14 లక్షల అంచనాలు వేశారని కాని రూ. 8.58 లక్షలు చెల్లించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా క్యూలైన్ల విషయంలో కూడా పని అంచనా రూ. 8.30 లక్షల అంచనాలు ఉంటే బిల్లు మాత్రం రూ. 3.42 లక్షలు దేవస్థానం చెల్లించిందని చెప్పారు. పెయింటింగ్ ఖర్చు మాత్రం రూ.5 లక్షలు కాదని రూ. 5.40 లక్షలు చెల్లించినట్లు తెలిపారు. లోకల్ వాళ్లు ముందుకు రాకపోవడం వల్లనే స్థానికేతరులకు పనులిచ్చినట్లు పేర్కొన్నారు.

7న శ్రీగిరి క్షేత్రంలో ప్రత్యేకపూజలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న శ్రీగిరి క్షేత్రంలో సుబ్రహ్మణ్య షష్టి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు గురుస్వామి చిన్నయ్య తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రత్యేకహోమం, అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిర్మల్‌లో 2కె రన్ ప్రారంభించిన అదనపు కలెక్టర్



నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో 2కె రన్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించారు. క్రీడలశాఖ ఈ కార్యక్రమం ఏర్పాటు చేసింది. మంచిర్యాల చౌరస్తా నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు కొనసాగింది. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా అభివృద్ధికి అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినందున రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈవో రామారావు, క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, డీసీవో రాజమల్లు, తహసీల్దార్ రాజు, భూక్యా రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి

యోగా పోటీలకు బాసర విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బాసర, డిసెంబరు, 3: (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డిలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి బాసర నాగభూషణ విద్యాలయంకు చెందిన విద్యార్థులు దేవోజీ అవినాష్, సిహెచ్. అవంతిక ప్రతిభ చాటి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురావు తెలిపారు. తమ విద్యార్థులు యోగాపోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి జాతీయస్థాయిలో గతంలో ఎంపికైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సారి కూడా జిల్లా, రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

ట్రస్మా క్రీడల్లో విజయ స్కూల్ విద్యార్థుల విజయ కేతనం



ఛాంపియన్‌షిప్ ట్రోఫీతో విద్యార్థులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలో ట్రస్మా నిర్వహించిన ఆటల పోటీల్లో విజయ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి విజయ కేతనం ఎగురవేశారు. 7 బంగారు, కాంస్య, 6 రజిత పతకాలు సాధించి ఓవర్ ఆల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులను యాజమాన్యం మంగళవారం అభినందించింది. ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యన్నగారి భూమయ్య, కరస్పాండెంట్ నాగభూషణం, ఆడెపు సుధాకర్, అంబారాణి, విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం



సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డిని మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు సన్మానించారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా వచ్చిన ఆయన మేడిపల్లి గ్రామంలో రైతు పండగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగ్యనగర్‌లోని నివాసంలో శ్రీహరిరావు శాలువాతో సన్మానించారు.

ఘనంగా న్యాయవాదుల దినోత్సవం



నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బార్ అసోసియేషన్ నిర్మల్ ఆధ్వర్యంలో న్యాయవాదుల దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా న్యాయ వాదులు మాట్లాడుతూ... డాక్టర్ బి.రాజేంద్రప్రసాద్ జయంతి సందర్భంగా డిసెంబరు 3వ తేదీన న్యాయవాదుల దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. న్యాయవాదులు బి. శుభకరన్, ఎస్. గోవర్ధన్, నూనెగంగాధర్, వి.మహేందర్, అర్చన పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) సీఎం కప్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సీఎం కప్ పోటీల నిర్వహణ, ధాన్యం కొనుగోళ్లు, సమగ్ర ఇంటింటి సర్వే, ప్రభుత్వ వసతి గృహాల పర్యవేక్షణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో సీఎం కప్ క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మొదట గ్రామీణ స్థాయిలో పోటీలు నిర్వహించి వాటిలో విజయం సాధించిన వారికి మండల, జిల్లా స్థాయిల్లో పోటీలు నిర్వహించాలని సూచించారు. పోటీల నిర్వహణకు గ్రామాల్లో ఆట మైదానాలను గుర్తించి, పోటీలకు సిద్ధం చేయాలన్నారు. క్రీడల నిర్వహణలో క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, టెంట్ సహా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ గడువును డిసెంబరు 6వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. క్రీడల్లో అధికసంఖ్యలో యువత పాల్గొనే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ స్థాయిలో నలుగురు సభ్యులతో కూడిన బృందానికి పంచాయతీ కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామీణ స్థాయి, 10 నుంచి 12 తేదీల్లో మండల స్థాయి, 16 నుంచి 21 తేదీల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులంతా గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలోని పోటీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పోటీలను అత్యంత పారదర్శకంగా పర్యవేక్షించాలని, పోటీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియ 97.22 శాతం పూర్తయిందని తెలిపారు. డేటా నమోదు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కేజీబీవీ, వసతి గృహాల్లోకి బయటి వ్యక్తులను అనుమతించకూడదని అధికారులను ఆదేశించారు. వసతి గృహ ప్రత్యేక అధికారులు అప్రమత్తంగా ఉండి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు వసతి గృహాలను తనిఖీ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, సీపీవో జీవరత్నం, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రామారావు, డీపీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో గోవింద్, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాస్, మోహన్‌సింగ్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని టీఎన్జీవో సంఘ భవనంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, (జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారి) సీనియర్ న్యాయాధికారి రాధికలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా అధికసంఖ్యలో దివ్యాంగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. దివ్యాంగుల చట్టాలు, వారికి ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇదివరకే జిల్లాలో అలిమ్కో సంస్థ వారి ఆధ్వర్యంలో క్యాంపులు నిర్వహించామని తెలిపారు. అర్హులైన 868 మంది దివ్యాంగులకు 1429 ప్రత్యేక పరికరాలు త్వరలోనే అందిస్తామన్నారు. సదరం క్యాంపులు నిర్వహించి అర్హులైన వారికి ధ్రువ పత్రాలను అందిస్తామని తెలిపారు. అలాగే బస్ పాస్, సబ్సిడీ రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన దివ్యాంగులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు కలెక్టర్ అందజేసి అభినందించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో రాజేందర్, మెప్మా పీడీ సుభాష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, డీఎస్పీ ప్రభాకర్, ఏ సీడీపీవో నాగలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారులు, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు, దివ్యాంగులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళాసంఘాలు

స్వయంశక్తితో ఆర్థిక పురోభివృద్ధిని సాధించాలి

● మహిళా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాటిల్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మహిళా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళ పొదుపు సంఘాలు స్వయం శక్తితో ఆర్థిక పురోభివృద్ధిని సాధించాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫైజన్ అహ్మద్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం భైంసా ఏరియా ఆసుపత్రిలో ఇందిర మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళ అభ్యున్నతియే ధ్యేయంగా పెట్టుకొని పథకాలను ప్రవేశ పెడుతోందన్నారు. ప్రధానంగా స్వయం సహాయక సంఘాలను ఆర్థికపరంగా పూర్తి స్థాయిలో బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా మహిళ క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. క్యాంటీన్ నిర్వాహక సంఘాలకు అవసరమైన మేర రుణాలను సైతం అందించడం జరుగుతోందన్నారు. క్యాంటీన్ నిర్వాహకులు శుచి,శుభ్రత,పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. రోగులు, వారి సంబంధీకులకు అందుబాటు ధరలతో రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. లోటు,పాట్లకు తావులేకుండా తాజా సరుకులనే వినియోగించాలన్నారు. ఇందులో మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ అహ్మద్, మున్సిపల్ కౌన్సిలర్ తోట విజయ్, కోఆప్షన్ సభ్యుడు ఇంత్యాజ్ హాల్ హక్, కమిషనర్ రాజేష్ కుమార్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కాశీనాథ్‌తో పాటు మెప్మా అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల శ్రేణులు పాల్గొన్నాయి.

సోన్‌లో సైబర్ మోసాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సోన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మంగళవారం సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆన్ లైన్ మోసాలు, ఫేక్ కాల్స్ చేసి ఎవరైనా పాస్వర్డ్ చెప్పమని గాని, ఓటీపీ గూర్చి గాని ఎవరికీ షేర్ చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సోన్ ఎస్సై కే. గోపి, ఏఎస్సై హైమద్, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లాలో మిశ్రమ వాతావరణం

ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా చిరుజల్లులు

నిర్మల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మంగళవారం మిశ్రమమైన వాతావరణం కనిపించింది. జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉండి అక్కడక్కడ చిరుజల్లులు కురిశాయి. గత వారం రోజుల క్రితం వరకు ఎముకలు కొరికేసేలా ఉన్న చలి తీవ్రత ఈ మిశ్రమ వాతావరణంతో ఒక్కసారిగా తగ్గుముఖం పట్టింది. ఒక దశలో కొన్ని చోట్ల ఉక్కపోత వాతావరణం నెలకొంది. నిన్న మొన్నటి వరకు చల్లటి గాలులు, చలి తీవ్రతను ఎదుర్కొన్న జనం వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఒక్కసారిగా చిరుజల్లులు, ఉక్కపోతను ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతో మిశ్రమ వాతావరణంతో జనం అల్లాడిపోతున్నారు. జిల్లాలో 22 డిగ్రీల అత్యల్ప సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆర్టీసీ కార్మికుల వనభోజనాలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఆర్టీసీ డిపోలో కార్మికులకు మంగళవారం కార్తీక వనభోనాలు నిర్వహించారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్ కుమార్ పాల్గొన్నారు. బుధవారం నాడు ఇవి కొనసాగుతాయని డీఎం తెలిపారు. యాజమాన్యం సహకారంతో రెండు రోజులపాటు వనభోజనాలు నిరవహిస్తున్నామన్నారు.

వికలాంగులకు అన్ని రకాల సేవలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వికలాంగులకు ప్రభుత్వపరంగా అన్ని రకాల సేవలు అందించనున్నట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వికలాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫైలేరియా వ్యాధితో బాధపడుతున్న రోగులకు లెప్రా ఇండియా సహకారంతో పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. సత్యసాయి సంస్థ సహకారంతో వికలాంగులకు దుప్పట్లు అందజేశారు. డీపీఎంవో రాజేశ్వర్, లెప్రా ఫిజియోథెరపిస్ట్ కిషన్ రావు, మీడియా అధికారి రవీందర్‌రావు, సత్యసాయి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నిరసన ప్రదర్శనకు అనుమతి ఇవ్వాలి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆశా వర్కర్ల సమస్యలపై నిరసన తెలిపేందుకు ఈ నెల 4న అనుమతి ఇవ్వాలని ఆశావర్కర్ల సంఘం మంగళవారం జిల్లా వైద్యాధికారికి విజ్ఞప్తి చేసింది. సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. జిల్లా అధ్యక్షురాలు సుజాత, కోశాధికారి డి.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు

కోచ్‌ల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడా సంఘాల క్రీడాకారులు, కోచ్‌ల సమస్యలు పరిష్కరించాలని నిర్మల్ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఎస్ఏటీ చైర్మన్‌ను విజ్ఞప్తి చేసింది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ముఖ్య ప్రతినిధుల సమావేశానికి హాజరయ్యారు. చైర్మన్ శివసేన రెడ్డి ఇంటర్ స్కూల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. జాయింట్ సెక్రటరీ దయాత్ అక్షయ్, జిల్లా అధ్యక్షుడు సోమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే రైతురాజ్యం సాధ్యం

● నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీహరిరావు


మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీతోనే రైతురాజ్యం మవుతుందని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. మంగళవారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా నిర్మల్ రూరల్ మండలం మేడిపల్లి గ్రామ రైతువేదికలో రైతుపండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతులకు పదేళ్లలో బీఆర్ఎస్ పార్టీ చేయని మేలు పది నెలల్లోనే కాంగ్రెస్ పార్టీ చేసి చూపిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలు చేసి ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని తెలిపారు. రైతులు పండించిన సన్న రకం బియ్యానికి రూ. 500ల బోనస్ అందిస్తుందని తెలిపారు. తెలంగాణకు భారీగా అప్పులు ఉన్నప్పటికీ రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమ భీమ్‌రెడ్డి, అబ్దుల్‌హాది, రామేశ్వర్‌రెడ్డి, సోనియా సంతోష్, మామడ ఎంపీపీ జైసింగ్, రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు కుంట వేణుగోపాల్, ఒడ్నాల రాజేశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి, మధుకర్ రెడ్డి, సాగర్‌రెడ్డి, నాయకులు ఈటెల శ్రీనివాస్, ఓస రాజేశ్వర్, అతిక్ అహ్మద్, వాజిద్ అహ్మద్, సభాకలీం, మజార్, మహిళా నాయకురాలు వాణిరెడ్డి, చిన్ను, అజహరుద్దీన్, మతిన్, ఎంబడి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక


ఎంపిక లేఖ అందిస్తున్న రాధాకృష్ణ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డుకు నిర్మల్ జిల్లాకు చెందిన మసురే అర్చన ఎంపికైంది. బహుజన సాహిత్య సమాఖ్య జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ సోమవారం హైదరాబాద్‌లో ఎంపికైన లేఖ అందజేశారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పనిచేస్తున్న అర్చన చేసిన ఉత్తమ సేవలకు గాను ఈ అవార్డు ప్రకటించారు. ఈ నెల 15న న్యూ ఢిల్లీలో ఈ అవార్డు అందజేయనున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గౌతం, కోఆర్డినేటర్ హన్మాండ్ల విష్ణు, ఎంపిక కమిటీ సభ్యుడు నిగులపు లింగన్న పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కరించాలి


కుంటాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఆశాలు

కుంటాల, డిసెంబరు, 3 (ఆంధ్రజ్యోతి) : ఆశాల యొక్క అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లెప్రసీ, పల్స్ పోలియో పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే కొత్త సర్వేలు చేయించాలని కోరుతూ ఆశాల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ముందు ధర్నా నిర్వహించారు. డిసెంబర్ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా లెప్రసీ సర్వే చేయాలని జిల్లా అధికారులు ఆదేశిస్తు న్నారని ఇందుకోసం ట్రైనింగ్ కూడా ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు ఆపాలని ధర్నా నిర్వహించారు.

వికలాంగుల
సమస్యలను పరిష్కరించాలి

ఖానాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వికలాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వికలాంగుల సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని వికలాంగుల సమస్యలపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వికలాంగులకు ప్రతి నెల రూ. 10 వేల జీవన భృతిని అందజేయాలన్నారు. వికలాంగులకు రూ.3 లక్షల వరకు భేషరతుగా బ్యాంక్ రుణాలను అందజేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు తదితరులున్నారు.

పల్లె ప్రాంతాల అభివృద్ధిపై
ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి


అభివృద్ధి పనుల మంజూరి పత్రాలను అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా పల్లె ప్రాంతాల అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించిందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు గాను పంచాయతీరాజ్‌శాఖ ద్వారా రూ.19 లక్షలతో మంజూరైన ప్రొసిడింగ్ కాపీలను అందచేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పల్లె ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు గాను చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రాధాన్యతననుసారం ప్రగతికి బాటలు వేస్తున్నామని వివరించారు. ప్రధానంగా అంతర్గత రోడ్లు, మురికి కాలువ నిర్మాణానికి అధిక ప్రాధాన్యనిస్తున్నామని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క సహాయ,సహకారాలతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పాటుపడుతున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కోతుల్‌గాం గ్రామంలో రూ.7 లక్షలు, వానల్‌పాడ్ గ్రామంలో రూ.5 లక్షలు, కుంబి గ్రామంలో రూ.4 లక్షలు, తిమ్మాపూర్ గ్రామంలో రూ.3 లక్షలతో చేపట్టే రోడ్డు నిర్మాణపు పనులకు సంబంధించిన ప్రొసిడింగ్ కాపీలను ఆయా గ్రామాల ప్రతినిధులకు అందచేశారు. ఇందులో మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, ఆత్మ మాజీ చైర్మెన్ పోతారెడ్డి, కాంగ్రెస్ ప్రతినిధులు ముత్యం రెడ్డి, రాంకుమార్, గణేష్, గజానంద్, సాహెబ్‌రావ్, ప్రసాద్, రాహుల్, రవి, గోపి, రామేశ్వర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

నియోజక వర్గ గ్రామాల అభివృద్ధికి కృషి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావుపాటిల్


ధార్‌కుభీర్‌లో లోలెవెల్ వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కుభీర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావుపాటిల్ అన్నారు. మంగళవారం మండలంలోని ధార్‌కుభీర్ గ్రామ సమీపంలో రూ. 54లక్షల పంచాయత్‌రాజ్ నిధులతో నిర్మించనున్న లోలెవెల్ వంతెన పునర్‌నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్థులు ఎమ్మెల్యేకు శాలువ పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని గ్రామాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని అన్నారు. ధార్‌కుభీర్ గ్రామంలో మురికి కాల్వలు సీసీ రోడ్డు, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. చేపడుతున్న అభివృద్ధి పనులు మంజూరై నిధులను వెల్లడించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని, 6 అబద్ధాలు, 66 మోసాలు, 420హామీలు ఏమైనాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో మార్పురాలే బతుకు మారలే అనే కరపత్రాలను బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డా.విశ్వజిత్‌పటేల్, పీఆర్‌జేఈ రాజశేఖర్, నాయకులు ప్యాట లక్ష్మణ్, కందూర్ చిన్న సాయినాథ్, దోని దత్తాత్రి, ఏశాల దత్తాత్రి, డాంగే నాగేష్, రాజేష్‌బాబు, గులాబ్, గంగాధర్, మారుతి, లింబాద్రి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


భోసిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

తానూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలనలో భాగంగా మంగళవారం ఎస్సై రమేష్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మండలంలోని భోసి, ఝరి(బి), కేజీబీవీ పాఠశాలల్లోని విద్యార్థులకు సైబర్ నేరాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యాయ్థులు సైబర్‌నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మొబైల్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. మన వ్యక్తిగత వివరాలను ఎవరితో పంచుకోవద్దని సూచించారు. అదే విధంగా విద్యార్థినిలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

..మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ నైలు

భైంసా రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాటేగాం గ్రామ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల సీఐ నైలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు రైజింగ్ ప్రోగ్రాం వన్ నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి సీఐ నైలు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకుని సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొ న్నారు.

సారంగాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల స్వర్ణ ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎస్సై శ్రీకాంత్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ నేరాల బారిన పడిన సమయంలో వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలని వెంటనే సైబర్ నేరాలను అరికట్టవచ్చన్నారు. అలాగే మహిళలకు షీ టీం ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

సైబర్ క్రైమ్, డయల్ 100పై అవగాహన



లక్ష్మణచాంద, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని స్థానిక కస్తూరిబా గాంధీ పాఠశాలలో సైబర్ క్రైమ్,డయల్ 100పై ఎస్సై సుమలత మంగళవారం అవగాహన కల్పించారు. ఉన్నత చదువులపై, ఆరోగ్య సమస్యలను అధిగమించటంపై కూడా పలు సలహాలు, సూచ నలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి నవ్య, కానిస్టేబుల్స్, ఉపాధ్యాయులు హాజరయ్యారు.

సామాజిక రుగ్మతలపై అవగాహన

సిరికొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతల నిర్మూలన, సోషల్ మీడియా ద్వారా మోసాలు, రోడ్డు ప్రమాదాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు తదితర అంశాలపై మంగళవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ అవగాహన సదస్సుకు సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీయుల్లాఖాన్, ఎస్సై శివరాం హాజరై మాట్లాడారు. సమాజంలో చోటుచేసుకుంటున్న ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాలు, సామాజిక రుగ్మతలపై కళాకారుల బృందం తమ ప్రదర్శనల ద్వారా ప్రజలకు వివరించి చైతన్య పరిచారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ డీఎస్పీ హసీయుల్లాఖాన్, ఎస్సై శివరాం మాట్లాడుతూ... సామాజిక రుగ్మతలను నిర్మూలించి శాస్త్రీయ ధృక్పథంతో కూడిన అవగాహన కల్పించేందుకు యువత, విద్యార్థులు, స్వచ్ఛంధ సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళల రక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించవద్దని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అత్యవసర సమయంలో పోలీసుల సహాయం కోసం డయల్ 100, ఆన్లైన్ మోసాలకై సత్వర సలహా కోసం 1930 వంటి హెల్ప్ లైన్ నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థల పరిశీలన

సిరికొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ గృహ నమూనా నిర్మాణం కోసం తహసీల్దార్ తుకారం, ఎంపీడీవో రవీందర్ సోమవారం ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవీందర్ మాట్లాడుతూ...పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ళను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఈ ఇందిరమ్మ గృహ నమూనాను నిర్మించనుందని, ఈ మోడల్ గృహ నిర్మాణం ఆధారంగానే నిరుపేదలకు మంజూరు చేసిన ఇళ్ళను నిర్మించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఇందిరమ్మ గృహ నమూనా నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ఉన్నత అధికారులకు పంపించడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ ఉపేందర్, సర్వేయర్ గణేష్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు
నాణ్యమైన భోజనం అందించాలి

కుంటాల, డిసెంబరు, 3 : (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కుంటాల మండలంలోని ఆదర్శ మాడల్ పాఠశాల, కల్లూర్ కస్తుర్బా పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకుంటూ నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అంతేగాకుండా ప్రతిరోజు భోజనాన్ని పాఠశాలలో హెచ్‌ఎం ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై భాస్కరాచారి కస్తుర్బా పాఠశాలను సందర్శించి పాఠశాలలో ఆకతాయిల ప్రమేయం లేకుండా విద్యార్థినిలు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ప్రతిరోజు తమ సిబ్బంది పాఠశాలను సందర్శిస్తున్నారని విద్యార్థులకు ఎమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, డీటీ నరేష్ గౌడ్, ఎంపీవో రహీం, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నర్సరీ పనులను త్వరగా పూర్తిచేయాలి

సిరికొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు, ఆహ్లాదకర వాతావరణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందని, నర్సరీల పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఎంపీడీవో రవీందర్ ఈజీఎస్ సిబ్బందికి సూచించారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి


ఖానాపూర్‌లో శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

భైంసా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలి దశ ఉద్యమ తొలి అమర వీరుడు శ్రీకాంతాచారి వర్ధంతిని పురస్కరించుకొని భైంసాలో వివిధ పార్టీలు, సంఘాలు ఘనంగా నివాళులర్పించాయి. మంగళవారం స్థానిక బస్టాండ్ ఎదుట గల శ్రీకాంతాచారి చౌరస్తాలో జనసేన నిర్మల్ జిల్లా ప్రతినిధి సుంకెట మహేష్ బాబు నేతృత్వంలో వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిముషాలు మౌనం పాటించారు.వర్ధంతి సమావేశంలో జనసేన ప్రతినిధి సుంకెట మహేష్ బాబు మాట్లాడుతూ శ్రీకాంతాచారి జయంతి,వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సాధన కోసం ఆత్మార్పణం చేసుకున్న శ్రీకాంతాచారి త్యాగనిరతిని తెలంగాణ సమాజం ఎప్పటికి మరిచిపోదని వెల్లడించారు. ప్రభుత్వం అమరవీరుడైన శ్రీకాంతాచారి జీవిత చరిత్రను, త్యాగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో విశ్వబ్రాహ్మణ సంఘం భైంసా పట్టణ ప్రధాన కార్యదర్శి రామోజీవార్, ప్రతినిధులు గంగా ప్రసాద్, సాయినాథ్, శ్రీనివాస్, సచిన్, వరల్ సింగ్, చిన్నన్నలతో పాటు పలువురు పాల్గొన్నారు

ఖానాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తన ప్రాణాలను అర్పించిన శ్రీకాంతాచారి వర్ధంతిని ఖానాపూర్‌లో మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమానికి శ్రీకాంతాచారి త్యాగం కొత్త ఊపిరి పోసిందని పలువురు కొనియాడారు. ఆయన త్యాగాన్ని యావత్ తెలంగాణ రాష్ట్రం ఎన్నటికీ మరువలేదన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఏఎంసీ మాజీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, కామోజీ శ్రీనివాస్, చందు, రవితేజ, నాగేంద్రబాబు, తదితరులున్నారు.

రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికల హామీలను అమలు చేయాలి

హైదరాబాద్ ప్రజా దర్బార్‌లో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ)ఆధ్వర్యంలో సీతక్కకు వినతిపత్రం


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బీడీ పరిశ్రమలో పని చేస్తున్న బీడీ ప్యాకర్స్, నెలసరి ఉద్యోగులు, బీడీ కార్మికులకు రేవంత్‌రెడ్డి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేయకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) ఆధ్వర్యంలో మంగళవారం రోజున హైదరాబాద్ ప్రజా దర్బార్‌లో గ్రామీణ అభివృద్ధి శాఖ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి వర్యులు సీతక్కకు, ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ పరిశ్రమపై ఆధారపడి బ్రతుకుతున్నారని, బీడీ పరిశ్రమ రోజు రోజు క్షీణించి నెలకు 10, 12 రోజులు రోజుకు సగం పనిమాత్రమే దొరుకుతుందని కార్మికులు పని లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బీడీ కార్మికులను ఆదుకోవడానికి ఆనాటి తెలంగాణ ప్రభుత్వం 2013లో ఇచ్చిన హామీ ప్రకారం వెయ్యి రూపాయలు, 2018 ఎన్నికల్లో 2016 రూపాయల జీవన భృతి ఇస్తామని ప్రకటించి జిల్లాలో 60 వేల మందికే అమలు చేస్తున్నారు. మిగతా 40,000ల మందికి జీవన భృతి అందడం లేదని అనేకసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారని, అందుకే గత ప్రభుత్వాన్ని మార్చారని ఆయన అన్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సకల ప్రజలను దారిద్ర రేఖ దిగువన జీవిస్తున్న వారిని ఆదుకోవడానికి చేయూత పథకం కింద నలుగు వేల రూపాయలు జీవన భృతి ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్న పెన్షన్ల ఆచూకీ మర్చిపోయారని ఎద్దేవా చేశారు. ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్న నిరుపేద కార్మిక కుటుంబాలు బీడీ పరిశ్రమలో కీలక వ్యక్తులుగా మారిన బీడీ ప్యాకర్స్ నెలసరి ఉద్యోగులకు పీఎఫ్ కలిగి ఉన్న పురుషులైనందుకు మాత్రమే అప్పటి తెలంగాణ కేసీఆర్ ప్రభుత్వం జీవనభృతి ఇవ్వలేదని, ఈ ప్రభుత్వమైనా అంక్షలు పెట్టకుండా జీవో ప్రకారం పీఎఫ్ కలిగిన వారందరికీ జీవన భృతి ఇస్తామని, 2014 ఫిబ్రవరి 28 కటప్ తేదీని ఎత్తివేస్తామని ప్రకటించి ఉన్నారు. కానీ 9 సంవత్సరాల నుంచి ఆనాటి ప్రభుత్వం ఏ ఒక్క కొత్త కార్మికురాలు గాని కార్మికుడికి గాని జీవన భృతి అందించలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం పైన ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తూ సంవత్సరం గడుస్తున్న నేటికీ జీవనభృతి అమలు కాకపోవడం సిగ్గుచేటు విషయమన్నారు. కార్మికులకు చేయూత పథకం కింద నాలుగు వేల రూపాయలు జీవనభృతి మంజూరు చేసి పేద కుటుంబాలను ఆదుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఎఫ్ కలిగి ఉన్న కార్మికులకు జీవో, ఎంఎస్, ఎన్‌వో 38 ద్వారా జీవన భృతి అందజేస్తామని అప్పటి ప్రభుత్వం సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తాన్య ప్రకటించారు. కానీ నేటికీ అమలు కావడం లేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని లేనిచో ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం. నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేజ రాజన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. వెంకట్, రాష్ట్ర కోశాధికారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉత్తములుగా ఎదగాలి



బోథ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పట్టుదలతో అభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ పేర్కొన్నారు. మంగళవారం సోనాల మండల కేంద్రంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి రూ.500 కోట్లు కేటాయించిందని విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలని డీఎస్సీని నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారన్నారు. సోనాల పాఠశాల విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. పాఠశాలలో వసతుల కల్పనకు తమవంతు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిజ పశువుల చంటి, పట్టణ అధ్యక్షుడు అనిల్, బోథ్ మాజీ ఎంపీటీసీ కురుమే మహేందర్, చెట్ల ఉమేష్, షేక్ నాజర్, విజయభాస్కర్‌రెడ్డి, కసిరి పోతన్న, అంకుష్, రాకేష్, పవన్, శ్రీధర్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని
మోసం చేసిన వ్యక్తి కటకటాల పాలు

నేరడిగొండ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) ఎయిర్‌పోర్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడు కటకటాల పాలైన సంఘటన చోటు చేసుకుంది. నేరడిగొండ మండలం కుమారి గ్రామానికి చెందిన యువకుడు 2021లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా రచనపల్లిలో రత్నాడిపెన్స్ అకాడమిలో కోచింగ్‌చేస్తున్న సమయంలో చౌడిపల్లి గ్రామం చిత్తూరు జిల్లాకు చెందిన కుంచికళ్యాణ్ 26 అనే యువకుడు పరిచయమై బాధితుడితో కుంచి కళ్యానినాకు ఎర్‌ఫోర్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని బెంగులూరు వినాశ్రయంకు చెందిన అధికారులతో పరిచయం ఉందని చెప్పడంతో బాధితుడు కుంచికళ్యాణ్‌తో 13లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని రూ.5,88,586 నగదు ఫోన్ పే ద్వారా చెల్లించాడు. బాధితుడికి కుంచి కళ్యాణ్ తప్పుడు కాల్ లెటర్ ఇవ్వగా బెంగలూరుకు వెళ్లి విచారించగా అది తప్పుడుకాల్ లెటర్ అని తేలడంతో 2022లో కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఆదేశాల మేరకు ఉట్నూర్ డీఎస్పీ నాగేంద్ర పర్యవేక్షణతో ఇచ్చోడ సీఐ భీమేష్ ఆధ్వర్యంలో ఎస్సై శ్రీకాంత్ తన సిబ్బందితో మంగళవారం ఆదిలాబాద్ సమీపంలో నిందితుడు కుంచి కళ్యాణ్‌ను చాకచక్యంగా పట్టుకుని అతని వద్ద నుంచి రెండు లక్షల వెయ్యి రూపాయలు స్వాధీన పరచుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును చేదించిన ఎస్సై శ్రీకాంత్‌ను జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం అభినందించారు.

అడవులను కాపాడుకుందాం

కుంటాల, డిసెంబరు, 3: (ఆంధ్రజ్యోతి) : రాబోయే వేసవి కాలంలో అడవిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కుంటాల మండలంలోని మెదన్‌పూర్, అంబుగాం, రాజాపూర్ గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీ ప్రాంతంలో ఎండా కాలంలో ఎవరు తగ లబెట్టకూడదని అకస్మాత్తుగా మంటలు ఏర్పడితే మంటలను చల్లార్చాలని, అడవులను సంరక్షించుకుంటే కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో కీర్తిరెడ్డి, ఎఫ్‌బీవోలు మహేశ్వర్, ముస్తాక్, హరిలత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ఇంద్రవెల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బుద్ధానగర్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాల-2లో మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వైకల్యం అనేది శరీరానికి కాని మనస్సుకు కాదన్నారు. దివ్యాంగులు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని ఆదర్శంగా చేసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ముందుగా ఐఈఆర్పీ అనురాధ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా దివ్యాంగులకు అందుతున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆట పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంమోహన్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు రాథోడ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి

దిలావర్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులమని దిగులు చెందకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మండల విద్యాధికారి కస్తూరి శంకర్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దిలావర్‌పూర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... దివ్యాంగుల కోసం ప్రభుత్వం అనేక పథకాలు పెట్టి అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహాన్ని అందింపుచ్చుకుని భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రతి బుధవారం ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ ఉంటుందన్నారు.


పదో తరగతి ఫలితాలపై హెచ్‌ఎంలు, టీచర్ల శిక్షణ సమావేశంలో సూచనలు ఇస్తున్న ఇన్‌చార్జీ డీడీ జాదవ్‌వసంత్


విద్యార్థుల యాక్షన్ ప్లాన్ విడుదల చేస్తున్న పీఓ ఖుష్బుగుప్తా


గిరిజన సంక్షేమ అధికారులు, ఉపాధ్యాయులు తయారుచేసిన ప్రశ్నాపత్రాలు

ఆంధ్రజ్యోతి ఫోకస్



మిషన్ లక్ష్యం
పదిలో 100% ఉత్తీర్ణత

» గిరిజన సంక్షేమ పాఠశాలలో ప్రత్యేక ప్రణాళిక » ప్రత్యేక చొరవ చూయించిన ప్రాజెక్టు అధికారి

ఉట్నూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల అభి వృద్ధి సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీ డీఏ) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదవ తరగతిలో 100 శాతం ఫలితాలు తీసుకువచ్చేలా మిషన్ లక్ష్యం కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 124 ఆశ్రమ పాఠశాలల్లో పదవ తరగతిలో చదువుకుంటున్న 3,783 విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచే విధంగా రోజువారీ ప్రత్యేక కార్యక్ర మాన్ని నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.

జిల్లాల వారీగా విద్యార్థుల వివరాలు

ఆదిలాబాద్ జిల్లాలో 46 ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో 1754 మంది పదవ తరగతి విద్యార్థులు, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 45 పాఠశాలలో 1232 మంది, మంచిర్యాల జిల్లాలో 17 పాఠశాలలో 378 మంది, నిర్మల్ జల్లాలో 16 పాఠశాలలో 419 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

వంద రోజుల ప్రణాళిక రోజు

మిషన్ లక్ష్యంలో భాగంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తారు. 13 మార్చి 2025 వరకు ఈ ప్రణాళిక అమలులో ఉంటుంది. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 9గంటల వరకు పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వ హిస్తారు. అదే విధంగా సాయంత్రం 4.30 నుంచి 5.30గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. ఇప్పటికే 10వ తరగతి విద్యార్థులను ఏబీసీడీ గ్రూ పులుగా విభజించారు. అన్ని కేటగిరిలు విద్యార్థులు ఉండేలా ఈ గ్రూపులను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి గ్రూపును ఉపాధ్యాయునికి దత్తత ఇస్తున్నారు. ప్రతతి రోజు ఇద్దరు లేదా ముగ్గురు ఉపాధ్యాయులు రాత్రి సూపర్‌వైజర్ స్టడి డ్యూటీలు నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులకు వచ్చే సందేహాలను అప్పటికప్పుడు నివృత్తి చేయాలని, వారానికి ఒకసారి ప్రగతి నివేదిక రూ పొందించి ఇంకా మెరుగుపడే అంశాలపై విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమాలు అమలు చేయడానికి హెచ్ఎంలకు ఇచ్చిన అధికారులతో ప్రత్యేక టైం టేబుల్ ఏర్పాటుచేసి అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో ఈ విధానం పాఠశాలలో అమలు చేయడానికి ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు.

ప్రత్యేక ప్రశ్నాపత్రాల రూపకల్పన

నిశ్నాతులైన విషయ నిపుణులతో అంశాల వారీగా, సబ్జెక్టుల వారీగా ప్రశ్న పత్రాలు ఇంగ్లీష్ మీడియంలో రూపొందించి ప్రతివిద్యార్థికి ఇచ్చే విధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 124 పాఠశాలలకు ప్రశ్న పత్రాలు పంపిణీ చేయనున్నారు. మిషన్ లక్ష్యం అమలు కోసం పర్యవేక్షణ అధికారులను ఇప్పటికే నియమించారు. అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్‌తో పాటు ఏటీడీఓలతో బృందాలు అకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. మిషన్ లక్ష్యం అమలులో లోపాలను గుర్తించి సూచనలు సలహాలు అందించాలన్నారు. ఈ కార్యక్ర మం అమలులో నిర్లక్ష్యం వహించే పాఠశా లలపై చర్యలు తీసుకునే విధంగా ఐటీడీఏ పీఓకి నివేదికలు బృందాలు అందించను న్నాయి. 2023-24 విద్యా సంవత్రంలో అమలు చేసిన విధంగా మంచి ఫలితాల కోసం మిషన్‌లక్ష్యం అమలు చేయడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లలో 45 పాఠశాలల్లో 21 పాఠశాలల్లో 100శాతం ఫలితాలు, ఆసిఫాబాద్ జిల్లాలో 45 పాఠశాలలకు గాను 10 పాఠశాలలు, మ ంచిర్యాల జిల్లాలో 17పాఠశాలలకు గాను నాలుగు పాఠశాలలో, నిర్మల్ జిల్లా లో 16 పాఠశాలలకు గాను 12 పాఠశాలలు వందశాతం ఫలితాలు సాధించా యి. ఉమ్మడి జిల్లాలో 123 పాఠశాలల్లో 47పాఠశాలలు మాత్రమే వందశా తం ఫలితాలు సాధించడంతో ఈ సంవత్సరం అన్ని పాఠశాలల్లో సెంట్‌పర్సెం ట్ ఫలితాలు రావడానికి అందరూ కష్టపడాలని పీవో ఆదేశాలు జారీచేశారు.


సబ్జెక్టు టీచర్లకు సలహాలు ఇస్తున్న అకాడమిక్ మానిటరింగ్ అధికారి జగన్





మిషన్ లక్ష్యం పకడ్బందీగా అమలు

● ఆత్రంజగన్, ఐటీడీఏ విద్యాశాఖ, ఏసీఎంఓ ఉట్నూర్

పదవ తరగతి విద్యార్థులు ఉత్త మ ఫలితాలు సాధించేలా మిషన్ లక్ష్యం కార్యక్ర మాన్ని పకడ్బందీగా అమలు చేయనున్నాం. ఈఏడాది తొలిసారిగా ఆశ్రమ పాఠశాలల వి ద్యార్థులు ఇంగ్లీష్ మీడియంలో ప రీక్షలు రాయబోతున్నారు. విద్యార్థు లను మానసికంగా ధైర్యం కల్పిం చి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసే లా టీడీఏ పీఓ, గిరిజన సంక్షేమ డీడీ ఆదేశాల మేరకు మిషన్ లక్ష్యాన్ని పకడ్బందీగా నిర్వహించ నున్నాం. ప్రతీ విద్యార్థిపై దృష్టిపె ట్టేలా కృషిచేస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక ప్రణాళికలు రూపొం దించేలా హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశాం.



ఆధ్యాత్మికం

హరిహరుని దర్శనం సులువే!

● ఆన్‌లైన్ ద్వారా ముందుగానే బుకింగ్
● ఆసక్తి చూపుతున్న మాలధారులు

ఇచ్చోడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం లో అయ్యప్ప మాలధారణ చేసి మండల దీక్ష (41 రోజు లు) చేపట్టే కఠోర నియమ నిష్టలతో దాన్ని పూర్తి చేసి ఇరుముడి దాల్చి శబరి గిరీషున్ని దర్శించుకు నేందుకు ఏటా లక్షాలాదిమంది తరలివెళ్తుంటారు. 18మెట్లను ఎక్కి శబరి గిరీషుని దర్శించుకునేందుకు మాలధారణ చేసే వారిసంఖ్య ఏటేటా పెరుగుతోంది. నల్లని వస్త్రాలు ధరించి తలపై ఇరుముడితో మెడలోమాలతో మదినండా అయ్య ప్ప నామస్మరణతో.. కరిమల వాసుని కనులారా దర్శించు కునేందుకు ప్రయాణమవుతున్నారు. ఏటా జిల్లా నుంచి దాదాపు లక్షమందికిపైగా భక్తులు శబరిమల తరలివెళ్తుం టారు. రోజూవెలల్లో మాలధారులు స్వామి దర్శనానికి బా రులు తీరుతుంటారు. దీంతో అక్కడ ఇబ్బందులు తప్పే పరిస్థితి. అందుకే కేరళ ప్రభుత్వం ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుకింగ్‌ను ప్రవేశపెట్టింది. అందులో టిక్కెట్ నమోదు చేసుకోవడం ద్వారా వారు సూచించన సమయానికి దర్శనం సులువుగా అయ్యే అవకాశాలున్నాయి. దీంతో సమయం ఆదా కావడం, వేచి ఉండాల్సిన అవసరం లేకు ండా ప్రయాణం సులువుగా ముగించుకుని తిరుగు ప్రయాణం కావచ్చన్నది సుస్పష్టం.

టికెట్ ఎలా బుక్ చేసుకోవాలి

కంప్యూటర్ ఉండి ఆన్‌లైన్ సౌకర్యం కలిగిన వారు ముందుగా గూగుల్ పోర్టల్‌ను తెరవాలి. అందులో (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. శబరిమల విర్చువల్ క్యూ పోర్టల్) అని టైప్‌చేయాలి. అక్కడ కేరళ పోలీస్ వెల్‌కమ్స్ పిల్‌గ్రిమ్స్ అని కనిపిస్తుంది. దాని కిందనే సెర్చ్ అవైలబులిటి అని కన్పిస్తోంది. అక్కడ ప్రస్తుతం డిసెంబరు, జనవరి మాసా లు పొందుపరుచబడి ఉంటాయి. భక్తులు ఏ నెలలో అయ్యప్ప దర్శనానికి వెళ్లాలనుకుంటున్నారో అక్కడ న మోదు చేసి సెర్చ్‌పై క్లిక్ చేయాలి. ఆ నెలలో తేదీలు కని పిస్తాయి. అక్కడ గడి ఎరుపు రంగులో ఉంటే ఆ తేదీల్లో బుకింగ్ పూర్తి అయినట్లుగా భావించాలి. తెలుపు రం గులో ఉంటే ఆరోజు బుకింగ్ లేదని అర్థం ముదురు ఆకుపచ్చలో ఉంటే ఖాళీలు ఉన్నట్లు అర్థం అప్పుడు ఆకు పచ్చ రంగు గడుల్లోని తేదీపై క్లిక్ చేయగానే అది ఊదా రంగులోకి మారుతుంది. పక్కనే దర్శన వేళలు సైతం కనిపిస్తాయి. సమయాన్ని బుక్ చేసుకోవాలి. అపుడు కోడ్ అడగుతుంది. అనంతరం గెస్ట్ ప్రొఫైల్ అనే పేజీ కని పిస్తుంది. అందులో దర్శనాకి వెళుతున్న వ్యక్తిపేరు, వయ సు, చిరునామా, రాష్ట్రం, సెల్‌ఫోన్ నంబరు తదితర వివ రాలు, చిరునామాకు సంబంధించి ఆధార్ లేదా గుర్తింపు కార్డు వివరాలు నమోదుతో అప్‌లోడ్ చేయాలి. అనంత రం దాన్ని ప్రింటు తీసుకోవాలి. దర్శనానికి వెళతున్నపుడు ఆ కాగితంతో పాటుఉ, మనం అప్‌లోడ్ చేసిన గుర్తింపు కార్డును వెంట తీసుకోవాల్సి ఉంటుంది. తద్వారా నమో దు చేసుకున్న వేళలల్లో సులువుగా అయ్యప్పను దర్శించు కునే అవకాశం ఉంటుంది. ఎక్కువ మంది భక్తులు తమ ఆధార్ కార్డునే నమోదు చేసుకుంటారు.

ఏటా బుక్ చేసుకునే దర్శనానికి

● కొండ హరిప్రసాద్ గురుస్వామి, ఇచ్చోడ



ప్రస్తుతం 29వ సారి అయ్యప్ప మాలధారణ చేశాను. గతంలో అయ్య ప్ప దర్శనం అంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. కేరళ ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వా రా అయ్యప్ప దర్శనానికి అవకాశం కల్పించింది. అప్పటినుంచి ఏటా ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుక్‌చేసు కుని దర్శనానికి వెళ్తాను. మా బృందంలోని సభ్యులందరూ ఇలాగే దర్శ నం చేసుకుంటాం. ఫలితంగా సులువుగా దర్శనం అవుతుంది.

టికెట్ బుకింగ్ తప్పనిసరి

● హన్మంత్‌రెడ్డి, గురుస్వామి, పిప్రి బజర్‌హత్నూర్ మండలం



ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్ గురించి తెలుసుకు న్నా. టికెట్ బుక్ చేసుకోకుండా దర్శనానికి వేళ్తే స్వామివారి దర్శనం కోసం 10 నుంచి 16 గంటల సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. అందుకే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని సన్నిధానం నుంచి మా ప్రయాణాన్ని సులువు చేసుకునే మార్గన్ని టికెట్ ఎంచుకుంటున్నాం.

పక్కాగా పంచాయతీ రాజ్

కాంట్రాక్టు ఉద్యోగుల వివరాల నమోదు

● ఈ-పంచాయతీలో నమోదుకు ప్రభుత్వ ఆదేశం ● మండలాల వారీగా చర్యలు చేపట్టిన ఎంపీడీవోలు


భైంసాలో వివరాలు నమోదు చేయిస్తున్న ఎంపీవో

భైంసా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ కార్యాల యాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమ స్యలు తీర్చేందుకు గాను ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే సంబంధిత కార్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పంచా యతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు, కం ప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ ఉద్యోగుల వివరాలను సేకరించాలని నిర్ణయం తీసుకుంది. పంచాయతీరాజ్ శాఖ అ ధికార యంత్రాంగం వీరందరి వివరాలు సేకరి ంచి వాటిని ఈ-పంచాయత్ వెబ్‌సైట్‌లో నమో దు చేయాలని అన్ని జడ్పీల సీఈవోలు, డీపీవో లు, ఎంపీడీవోల సోమవారం ఆదేశాలు జారీచే సింది. దీంతో జిల్లాలోని 18 మండల పరిషత్, జిల్లా పరిషత్ అధికారులు కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను సేకరించి ఈ- పంచాయతీలో నమో దు చేసే చర్యలను చేపట్టారు.

● విభాగాల వారీగా..

జిల్లాలో 18మండలాలు ఉండగా ఆయా మ ండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు మంగళవా రం కాంట్రాక్టు ఉద్యోగుల వివరాలను సేకరణ చర్యలకు ఉపక్రమించారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్లు, కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ ఉద్యోగులకు సంబంధించిన పూర్తి వి వరాలను సేకరిస్తున్నారు. విభాగాల వారీగా ఉ ద్యోగుల వ్యక్తిగత వివరాలతోపాటు ఫోన్ నంబ ర్లు, బ్యాంక్ అకౌంట్ వివరాలు సేకరిస్తూ ఈ-ప ంచాయత్‌లో నమోదు చేస్తున్నారు.

● సమస్యలు పరిష్కారానికే..

పంచాయతీరాజ్ శాఖలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వివరాలను సేకరిస్తున్నట్లుగా సమాచారం. ప్రభుత్వం వద్ద వీరందరి పూర్తి వివరాలు లేకపోవడం మూలం గా బడ్జెట్‌లో కేటాయింపులు సక్రమంగా జరు గడం లేదని తెలిసింది. ఈ క్రమంలోనే వీరికి వే తనాలు సకాలంలో అందించేందుకు వీలు లేకు ండా పోయిందని ప్రభుత్వం గుర్తించింది. ఒక్కో సారి 3 నుంచి 4నెలల వరకు వేతనాల చెల్లిం పులు చేపట్టలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. పంచాయతీరాజ్ శాఖ సేవల విషయానికి సం బంధించి సీఎం, మంత్రుల సమీక్షల సందర్భం గా కాంట్రాక్టు ఉద్యోగుల స్పష్టమైన సమాచా రాన్ని ఉన్నతాధికారులు ఇవ్వలేకపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిష త్, గ్రామ పంచాయతీల్లో లక్ష మందికి పైగా ఆయా ఉద్యోగులు పని చేస్తున్నారు. దీర్ఘకాలికం గా సేవలందిస్తున్నప్పటికీ వారి వివరాలు ప్రభు త్వం వద్దలేవు. పని భారం ఎక్కువగా ఉందని కొందరు ఉద్యోగులు వెళ్లిపోతుండగా.. వారి స్థాన ంలో కొత్త వారిని తీసుకోవడం లేదు. ఈ సమ స్యల నేపథ్యంలో వారందరి వివరాలు పక్కాగా నమోదు చేయాలని ప్రభుత్వం చర్యలు చేపట్టిం ది. మూడు రోజుల వ్యవధిలో ఈ-పంచాయతీ లో వీరందరి వివరాలను నమోదు పూర్తి చేసే విధంగా ఎంపీడీవో, ఎంపీవోలు చర్యలను ముమ్మరం చేశారు.

పరాఖ్ సర్వేకు పక్కాగా ఏర్పాట్లు

● నేడు ఎంపిక చేసిన 91 పాఠశాలల్లో పరీక్ష నిర్వహణ ● పరీక్షకు హాజరుకానున్న 2500 మందిపైగా విద్యార్థులు



భైంసా, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించేందుకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నాలుగేళ్లకోసారి జాతీయ సాధన సర్వే (న్యాస్) నిర్వహిస్తోంది. ఈ ఏడాది రాష్ట్రీయ సర్వేక్షణ్-2024 పేరిట ఎన్‌సీఈఆర్టీలోని స్వతంత్ర సంస్థ 'పరాఖ్' సర్వే పరీక్షను బుధ వారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 2021లో నిర్వహించిన ఈ పరీక్షలో రాష్ట్ర ప్రగతి అట్టడుగున ఉంది. అప్రమత్తమైన రాష్ట్ర విద్యాశాఖ పరాఖ్ పరీక్షకు విద్యార్థుల్ని సం సిద్ధుల్ని చేసేందుకు మాదిరి పరీక్షలు నిర్వహిం చిన విషయం తెలిసిందే. జిల్లాలో ఎంపిక చేసిన 91 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధి చిన 2500 మందికి పైగా మంది విద్యార్థులు స ర్వే పరీక్షకు హాజరుకానున్నారు.

అప్షనల్ ప్రశ్నలతో..

గతంలో 3, 5, 8, 10 తరగతుల విద్యార్థులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించగా ప్రస్తుతం 3, 6, 9 తరగతుల విద్యార్థులకు వారి తరగతి స్థాయి కి తగ్గట్లు భాష, గణితం, సోషల్ సైన్సు, పరిస రాల విజ్ఞానంతోపాటు క్రిటికల్ థింకింగ్ అంశా లపై అప్షనల్ ప్రశ్నలతో విద్యార్థి సామర్థ్యాలు పరీక్షిస్తారు. ఓఎంఆర్ షీట్‌లో జవాబులు గుర్తిం చాల్సి ఉంటుంది. కేంద్రీయ విశ్వవిద్యాలయ విజ యవాడ ప్రిన్సిపల్ సందీప్ పరాఖ్ సర్వే పరీక్ష కు కోఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. ఈనె ల 4న ఉదయం 10.30కు పరీక్ష ప్రారంభిం చా లని, 100శాతం హాజరయ్యేలా చూడాలని కోఆర్డి నేటర్ ఆదేశించారు.


91 పాఠశాలల్లో పరీక్ష నిర్వహణ

జిల్లాలో పరాఖ్ సర్వే పరీక్షను 91 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వ హించనున్నారు. ఇందులో 3వ తర గతికి సంబంధించి న 33 పాఠశాలలు, 6వ తరగతికి సం బంధించి 26 పాఠ శాలలు, 9వ తరగ తికి సంబంధించి 32 పాఠశాల లను ఎంపికచేశారు. సం బంధిత పాఠశాల ల్లో బుధవారం ఉ దయం10.30 నుం చి పరీక్ష నిర్వహిం చేందుకు అధికారు లు చర్యలు తీసు కున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం..

● రామారావు, డీఈవో, నిర్మల్

పరాఖ్ సర్వే పరీక్షకు 136మంది ఇన్విజిలేట ర్లు, 90 మంది పరిశీలకులను నియమించాం. ప రీక్ష సజావుగా కొనసాగేందుకు ప్రణాళికబద్ధమై న ఏర్పాట్లు పూర్తి చేశాం. హాజరయ్యే విద్యార్థుల ప్రాథమిక సమాచారం సేకరించాలని ఆ యా విద్యాసంస్థలకు సూచించాం.



ఆర్టీసీ బస్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

నేరడిగొండ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాలకు వెళ్తే.. నిజామాబాద్ నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు వస్తున్నది. ఈ క్రమంలో నేరడిగొండ మండలం రోల్‌మామడ టోల్‌ప్లాజా సమీపాన ఆర్టీసీ బస్సు ముందర ఉన్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో లారీనీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందర అద్దాలు పగలాయి. బస్సులు ఉన్న ప్రయాణికులకు క్షేమంగా ఉండడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్యేగా గెలిచాం.. కానీ!?





- జిల్లాలో కాంగ్రెస్సేతర ఎమ్మెల్యేల అసంతృప్తి
- ఏడాది గడిచినా ఏసీడీఎఫ్ నిధుల ఊసేలేదు
- నియోజకవర్గాల్లో చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ ఇన్‌చార్జీలు
- ఎన్నికల హామీలపై పెరుగుతున్న ఒత్తిళ్లు
- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు ఏడాది పూర్తి

ఆదిలాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లి ఎన్నికల్లో గెలిచిన.. అధికారం లేక పోవడంతో జిల్లా ఎమ్మెల్యేలు కొంత అసంతృప్తికి గురవుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన ఫలితాలే వచ్చినా జిల్లాలో మాత్రం ప్రతిపక్ష పార్టీలదే హవా కనిపించింది. దీంతో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ నియోజక వర్గంలో పాయల శంకర్ (బీజేపీ), బోథ్ నియోజక వర్గంలో అనిల్ జాదవ్ (బీఆర్ఎస్)లు శాసనసభ్యులుగా విజయం సాధించారు. ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యేలకు కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల్లో ఎన్నో అష్టకష్టాలు పడి గెలిచినా అధికారంలో లేక పోవడంతో ఆశించిన అభివృద్ధి జరుగడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటిస్తూ ప్రాధాన్యతను ఇస్తున్నా నిధులు మంజూరు కాక పోవడంతో ఎమ్మెల్యేలు కొంత నిరాశకు గురవుతున్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు తొలిసారి గెలిచిన వారే కావడంతో నియోజకవర్గ ప్రజలకు ఏదో చేయాలన్న తపన, ఉత్సాహం, పట్టుదల ఉన్నా ప్రభుత్వం సహకరించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు గెలువడంతో ఆశించిన అభివృద్ధి జరుగడం లేదంటు జిల్లా వాసులు చర్చించుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడై డిసెంబరు 3తో యేడాది కాలం పూర్తయిన సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

నిధులు రాక నిరాశ..

ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచామనే ఆనందమే తప్ప నిధులు లేక నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వం నియోజక వర్గాల అభివృద్ధికి ఎమ్మెల్యేలకు అందించే అసెంబ్లీ కాన్సిస్టెన్సి డెవలప్‌మెంట్ ఫండ్ (ఏసీడీఎఫ్) నిధుల ఊసేత్తడమే లేదంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ.3కోట్ల ఏసీడీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఇవి ఏ మూలాన సరిపోవంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏసీడీఎఫ్ నిధుల పరిమితిని రూ.5కోట్లకు పెంచింది. కానీ ఇప్పటి వరకు నయా పైసా కూడా మంజూరు చేయక పోవడంతో నియోజక వర్గాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయింది. గడిచిన ఏడాదిలో ఎమ్మెల్యేలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను మాత్రమే ప్రారంభించి అదనపు నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే కోట్ల రూపాయల ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించిన నిధులు మంజూరుకాక పోవడంతో నిరాశనే కనిపిస్తోంది. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లా గ్రామీణ రోడ్ల అభివృద్ధి మాత్రం (సీఆర్ఆర్) నిధుల కింద రూ.33.43 కోట్లను మంజూరు చేసినట్లు తెలుస్తోంది.

ఇన్‌చార్జీలదే పై చేయి..

గత కొంత కాలం క్రితం ప్రభుత్వం మంజూరు చేసిన స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) నిధుల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలదే పై చేయిగా మారింది. ఎస్‌డీఎఫ్ కింద నియోజక వర్గానికి రూ.10కోట్ల నిధులను కేటాయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. దీంతో జిల్లా ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు పోటాపోటీగా అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించారు. కానీ జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జీలు ప్రతిపాదించిన పనులకే ఆమోదం తెలుపడంతో ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. దీంతో కాంగ్రెస్ ఇన్‌చార్జీలదే పై చేయిగా మారింది. కనీసం అధికారుల బదిలీలు, పోస్టింగ్‌ల్లోనూ ఎమ్మెల్యేల సిఫార్సులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ప్రచారం జరుగుతోంది. నియోజక వర్గాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ఇలాంటి పరిస్థితులతో అధికారులపై ఒత్తిళ్లు తీవ్రమవుతున్నాయి. తాము సూచించిన వారికే పనులను కేటాయించాలంటూ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు ఒత్తిళ్లు చేయడంతో అధికార యంత్రాంగం అయోమయానికి గురవుతోంది.

ఏమి చేయలేని పరిస్థితి..

ఎమ్మెల్యేగా గెలిచినా అధికారం లేక పోవడంతో ఏమి చేయలేని పరిస్థితి ఉందంటూ ఎమ్మెల్యేలు బహిరంగంగానే చెబుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన ఫలితం కనిపించడం లేదంటున్నారు. ఎన్నికల్లో గెలిచి ఏడాది గడిచి పోవడంతో హామీలను నెరవేర్చాలంటూ ముఖ్య అనుచరులు, కార్యకర్తలు ఎమ్మెల్యేలపై ఒత్తిళ్లు చేస్తున్నారు. వివిధ రకాల పనుల కోసం ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదంటూ నియోజక వర్గ ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కానీ ప్రతిపక్షంలో కొనసాగుతున్న ఎమ్మెల్యేలకు చెప్పుకోలేని పరిస్థితులు ఉన్నాయంటూ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ముఖ్యంగా కమ్యూనిటీ హాల్స్, గ్రావెల్, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, ఆలయాల నిర్మాణం, లో లెవల్ వంతెనలు, సవారి బంగ్లాల నిర్మాణం లాంటి పనులను చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నయా పైసా కూడా మంజూరు చేయడం లేదంటూ ఎమ్మెల్యేల అనుచరులు చెబుతున్నారు. తాము నమ్ముకున్న నేత గెలిస్తే తమ బతుకులు బాగుపడుతాయని భావించిన ఎందరో మంది ముఖ్యనేతలు, అనుచరులు, పార్టీ కార్యకర్తల భవిష్యత్తు ప్రశ్నార్థకంగానే మారిందంటున్నారు.

పులి కలకలం



కొబ్బరిగూడ గ్రామ శివారులో పర్యటించిన అటవీ శాఖ అధికారులు

ఇంద్రవెల్లి,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకర్ గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొబ్బరిగూడ గ్రామ సమీపంలో వ్యవసాయ చేనులో తెల్లవారు జామున పులి కనిపించిందంటూ స్థానికులు చెప్పడంతో కలకలం రేగింది. దీంతో ఏ క్షణంలోనైనా పులి గ్రామంలోకి రావచ్చని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పులి సంచరిస్తున్నట్లు పుకార్లు రావడంతో అటవీ శాఖ బీట్ ఆఫీసర్లు రాథోడ్ జ్యోతి, రాథోడ్ రాజులు మంగళవారం గ్రామ శివారులో పర్యటించి పరిసరాలను నిశితంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లోని రైతులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. పులి సంచారంపై ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదని వారు తెలిపారు.

● పులుల దాడుల నుంచి ప్రజలను రక్షించాలి

గుడిహత్నూర్: జిల్లాలో పులుల దాడుల నుంచి ప్రజల ప్రాణాలను రక్షించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు, కూలీలకు అటవీ శాఖ అధికారులు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్నందున పులుల సంచరించే అవకాశం ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పులుల దాడుల నుంచి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో ఆదివాసి సేన జిల్లా ఉపాధ్యక్షుడు టేకం భీంరావు, ఆదివాసీ సేన నాయకులు సలాం జాకు, పెందూర్ గోవింద్‌రావు, కుంరం విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వైల్డ్‌లైఫ్ బోర్డు సభ్యుడిగా వెడ్మబొజ్జు



సీఎంని కలిసి ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్,డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రవన్యప్రాణి సంరక్షణ బోర్డులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌కు చోటు లభించింది.రాష్ట్ర సీఎంచైర్మన్‌గా ఉన్న ఈ కమిటీలో ఖానా పూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటే ల్‌ను సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చే సింది. కమిటీలో మరో ముగ్గురు ఎమ్మెల్యేలను సభ్యులుగా నియమించారు. మూడు సంవత్సరాల పాటు ఈ కమిటీ కొనసాగుతుంది.వన్యప్రాణి సంరక్షణకు ఈబోర్డు ప్రభుత్వానికి సల హాలు ఇస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి కృసి చేసే బాధ్యత కలిగి ఉంటుందని, ఈ కమిటీలో అవకాశం కల్పించడంతో సీఎం రేవం త్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కమిటీలో మరో ముగ్గురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీతో పాటు పన్నెండు మంది రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు కూడాసభ్యులుగా ఉంటారు.కవ్వాల్‌టైగర్ జోన్ పరిధిలో ఉన్న ఖానాపూర్‌నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను ఈ కమిటీలో చోటు దక్కడంతో ఈ ప్రా ంత సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయని ప్ర జలు భావిస్తున్నారు.వన్యప్రాణి సంరక్షణబోర్డు సభ్యుడిగా ఎమ్మెల్యే నియామకం పట్ల సర్వత్రహర్షం వ్యక్తం అవుతుంది.

నేడు పీడీఎస్ బియ్యం బహిరంగ వేలం

ఇంద్రవెల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వుల మేరకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు స్థానిక తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్న 78 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మండల కేంద్రంలోని రేషన్ షాపు-3లో భద్రపరచడం జరిగిందని, కలెక్టర్ ఉత్తర్వుల మేరకు మండల కేంద్రంలోని రేషన్ షాపు-3లో మధ్యాహ్నం 12 గంటలకు పౌర సరఫరాల శాఖ ద్వారా బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు రూ.10 వేల దరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు.

కొత్తగా విధుల్లోకి చేరిన కానిస్టేబుళ్లు

బోథ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా ఏడుగురు మంది కానిస్టేబుళ్లు మంగళవారం విధుల్లోకి చేరారు. ఇందులో ఏడుగురిలో ఐదుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారని ఎస్ఐ ఎల్. ప్రవీణ్ తెలిపారు.

దివ్యాంగులు విశ్వాసంతో ముందుకు వెళ్లాలి

● కలెక్టర్ రాజార్షిషా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌అర్బన్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి)ప్రభుత్వం వికలాంగులకు హక్కులను కల్పించడంతో పాటు సమాజంలో వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్‌రాజార్షిషా, ఎమ్మెల్యే పాయల శంకర్‌లు అన్నారు. అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ రాజార్షిషా, శాసనసభ్యులు పాయల్‌శంకర్, మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, డీఎల్‌సీఏ కార్యదర్శి సౌజన్య జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. వికలాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని, దివ్యాంగుల కోసం ప్రభుత్వం అన్నివిధాలుగా కృషి చేస్తుందన్నారు. వికలాంగుల కోసం తనవంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. వికలాంగుల తమ ప్రతిభతో వివిధ రంగాల్లో ముందుకు వెళ్తున్నారని వికలాంగులు శరీర లోపమే గాని మానసికంగా, స్థిరమైన ఆరోగ్యంగా కలిగి ఉంటారన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ ఇళ్ల కేటాయింపుల్లో వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలతో పాటు ప్రభుత్వం పేదలకు నిర్మించి ఇచ్చే ఇళ్ల కేటాయింపుల్లో వికలాంగులకు తొలి ప్రాధాన్య ఇవ్వాలన్నారు. స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా బ్యాంకులు రుణాలు ఇవ్వాలని దీని కోసం ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.ఇందులో డీడబ్ల్యూఓ సబిత, వికలాంగుల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● నూతన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రామ్, టీబీపై సంబంధిత శాఖల అధికా రులతో జిల్లా కలెక్టర్ రాజార్షిషా, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాలవీయతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని విద్యా సంస్థలను పొగాకు రహితంగా మార్చాలన్నారు. కొత్త చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలని సూచించారు. విద్యా సంస్థల 100 గజాల పరిధిలో ఉన్న పొగాకు ఉత్పత్తుల దుకాణాలను తొలగించాలని, యెల్లో లైన్ నిబంధనలు పాటించాలని తెలిపారు. పొగాకు రహిత విద్యా సంస్థల ఏర్పాటుకు అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వ యంతో పని చేయాలని సూచించారు. పొగాకు పంటలు పండించే రైతులకు అవగాహన కల్పించి ప్రత్యామ్నయ పంటల వైపు మళ్లించాలనిసూచించారు. బీడీ కార్మికులకు ప్రత్యామ్నయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కార్మికశాఖ కమిషనర్‌కు సూచించారు. అనంతరం టీబీ పై సమీ క్షించి జిల్లా కేంద్రంలోని ఇద్దరు టీబీ వ్యాధిగ్రస్థులకు కిరాణ సరుకలు అందిం చారు. ఇందులో వైద్యాధికారి నరేందర్‌రాథోడ్, మలేరియా అధికారి పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ రాజార్షిషా, ఎమ్మెల్యే

ఉట్నూర్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంను మంగళవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలోఉన్న ఐటీడీఏ వికాసం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికాసం పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల మధ్య ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిఖుష్బు గుప్తా, ఇన్‌చార్జీ డీడీ జాదవ్‌వసంత్, ఏటీడీఓలు క్రాంతికుమార్, అమిత్‌కుమార్, జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, ఏసీఎంఓ ఆత్రంజగన్, పీడీ జాదవ్ హేమంత్‌నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వికాస్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ప్రాజెక్టు అధికారి కేక్‌కట్ చేసి దివ్యాంగులకు తినిపించారు. ఈ సందర్భంటా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం కృషి చేస్తుందన్నారు. అన్ని విధాల సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నందున వికాసం పాఠశాల ఉపాధ్యా యులు సైతం కష్టపడి పని చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. జిల్ల స్థాయి క్రీడల్లో పాల్గొని విజేతలు నిలిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

ఆదివాసులపై పెట్టిన అన్ని కేసులను ఎత్తి వేయాలి



మాట్లాడుతున్న ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు

ఇంద్రవెల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జైనూర్ ఘటనలో ఆదివాసీలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర కన్వీనర్ బుర్ర పోచయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రాధాకృష్ణ ఆలయ అవరణలో ఆదివాసీ గిరిజన పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9 ఆదివాసీ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. చట్టబద్దత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో వంద శాతం విద్య, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు ఆదివాసులకు కల్పించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక సంస్థ ఎన్నికల రిజర్వేషన్లు వందశాతం ఆదివాసులకే కల్పించాలని డిమాండ్‌చేశారు.ఈకార్యక్రమంలో గోండ్వానా పంచాయితీ రాయి సెంటర్ జిల్లా సార్మేడి మెస్రం దుర్గు, ఆదివాసీస సమన్వయ కర్త సీడాం భీంరావు, తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్, కేస్లాపూర్ సార్మేడి మెస్రం వెంకట్‌రావు, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పెందోర్ దాదిరావుచ మండల అధ్యక్షులు పూర్క చిత్రు, నాయకులు ఆర్కా ఖమ్ము, తొడసం నాగోరావు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని బ్యాంకు ఎదుట నిరసన

తలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేసినప్పటికీ కొంత మంది రైతులకు రెండు లక్షల లోపు ఉన్నప్పటికీ రుణమాఫీ కాలేదని మంగళవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో గల బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకు కార్యాలయం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అందరి రైతులకు రుణమాఫీ అవుతున్న తమకు ఇంత వరకు రుణమాఫీ కాలేదని తలమ డుగు మండలంలోని పల్సీ(బి) గ్రామానికి చెందిన రైతులు మండల కేంద్రంలోని మహారాష్ట్ర బ్యాంకు ముందు సమూహంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రుణమాఫీ కాలేదని జిల్లా కలెక్టర్ దగ్గరికి వెళ్లిన వ్యవసాయ శాఖ అధికారులకు దగ్గరకు వెళ్లినా, బ్యాంకులో సమాచారం పంపలేదని అంటున్నారని వారు తెలిపారు. అదే విధంగా బ్యాంకు మేనేజర్‌ను అడిగితే సమాచారం మేము పూర్తిగా పంపించామని, సమాధానాలు ఇస్తున్నారని తాము ఎక్కడికి వెళ్లాలో తెలియక తిరిగి తిరిగి విసిగిపోయామని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేసామని చెబుతున్నప్పటికీ మాకు మాత్రం ఇప్పటి వరకు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. బ్యాంకులో రుణమాఫీ కాకపోవడంతో వడ్డీకి వడ్డీ పెరిగిపోతుందన్నారు. రైతుల గురించి ఎవరూ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు పరిష్కారానికి చూపాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రాథోడ్ షేకు, జాదవ్ మణిరామ్, రాథోడ్ శివలాల్, చౌహాన్, పరశురాం, రఘుపతి, వెంకట్‌రెడ్డి, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా?

ఉట్నూర్,డిసెంబర్3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ గురుకులబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్వీ చేపట్టిన గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి వెళ్లకుండా మమ్మల్ని పోలీసులు ఎ ందుకు అరెస్టు చేస్తున్నారని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్వీ బడిట కార్యక్రమం నిర్వహించకుండా పోలీసులు మంగళవారం ఉదయం రాజేశ్‌ను ఇంటి వద్ద అరెస్టు చేశారు.ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ మేం ఏమైనా దొంగతనానికి వెళ్లినమా...అక్రమ రెస్టులు అప్రజాస్వామిక అని, పేద విద్యార్థుల సమస్యలు అడిగితే ఈ ప్రభుత్వానికి ఎందుకు ఇంత భయమని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేస్తార అంటూ ప్రశ్నించారు. ప్రజాపాలన అంటే అక్రమ అరెస్టులా, ప్రజాపాలన అంటే ఫుడ్ పాయిజనా, ప్రజా పాలన అంటే విద్యార్థుల ప్రాణాలు పొట్టన పెట్టుకోవడమా అని ధరణి రాజేశ్ మండిపడ్డారు. ప్రభుత్వం ఇలాంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు.



రాజేష్‌ని అరెస్టు చేసిన పోలీసులు

గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం అందించక పోతే సహించబోమని అన్నారు. గత 10 ఏళ్లలో జరగని ఇబ్బందులు ఇప్పుడు ఎందుకు జరుగుతున్నాయన్నారు. ప్రత్యేక విద్యాశాఖ మంత్రి లేక పోవడంతోనే ఇలాంటివి జరుగుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీఆర్ఎస్వీ తరపున డిమాండ్ చేశారు.


మోడల్ హౌసింగ్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి

తలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని నిరుపేదల కోసం నూతనంగా నిర్మిస్తున్న డబల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాన నమూనా కోసం తలమడుగు మండల కేంద్రంలో మోడల్ హౌస్ నిర్మిం చేందుకు మంగళవారం జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి బసవేశ్వరరావు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఇల్లు లేని నిరుపేదల కోసం నూతనంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు నిర్మించేందుకు వాటికి సంబంధించిన ఇండ్ల నిర్మాణ నమూనాను మండల కేంద్రంలో నిర్మించేందుకు జిల్లా అధికారుల ఆదేశాల స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఇంటి నమూనా నిర్మాణం ప్రతి ఒక్కరికి కనబడే విధంగా నిర్మిస్తామన్నారు. అందుకు గ్రామస్తులు స్థలాన్ని ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం మంజూరు చేసే డబుల్ బెడ్‌ల ఇండ్ల నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలనుమంజూరు చేస్తుందన్నారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఆరు లక్షల రూపాయలతో మంజూరు చేసేందుకు ప్రణాళికను రూపొందించిందన్నారు. ఇందులో ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్ఐ రోహిదాస్, హౌసింగ్ ఏఈ నసీర్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతీ పాఠశాలలో మెనూ తప్పనిసరి పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో

తలమడుగు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలో అమలవు తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని మండల విద్యాధికారి వెంకట్‌రావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవ నంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేం చేసేందుకు విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజ నాన్ని తప్పనిసరిగా మెనూ పాటించాలన్నారు. అదే విధంగా ప్రతివారం విద్యార్థులకు మూడు కోడి గుడ్లు, ఆకుకూరలు, పప్పు దినుసులు అందించాలని సూచించారు. ముఖ్యంగా మధ్యన భోజన నిర్వహన ప్రాంతం పరిశు భ్రంగా ఉంచాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. అంతే కాకుండా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తినాలన్నారు. ఇందులో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

● పులి వదంతులను నమ్మొద్దు ● ఎఫ్ఆర్ఓ గణేష్



కిష్టాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరడిగొండ, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): అటవి వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఆర్ఓ గణేష్ అన్నారు. మంగళవారం మండలంలోని రోల్‌మండల, గుత్పాల, బుగ్గారం, పట్‌పడితాండ మాట్‌లొద్ది గ్రామాలలో పులి వచ్చిందని వదంతులు వ్యాపించడంతో అధికారుల బృందం అడవిలో పరిశీలించగా పులిజాడ లేదని ఎవరు కావాలని పుకార్లు లేపుతున్నారని, ఇటువంటి వదంతులును ప్రజలు నమ్మవద్దన్నారు. అడవులకు నిప్పు పెట్టవద్దని నిప్పు పెట్టడం ద్వారా వన్యప్రాణులతో పాటు అటవి సంపద కనుమరుగవుతుందన్నారు. ప్రజలు అటవి జంతువుల పట్ల అప్రమత్తంగాఉండాలన్నారు. అడవిని అనుకుని ఉన్న రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా కిష్టాపూర్ గ్రామంలో అటవీ శాఖ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అటవి సిబ్బంది భీంజీనాయక్, రాజేందర్, ధన్‌సింగ్ తదితరులున్నారు.

కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బోథ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఒక రూ.లక్ష17వేల రైతులు ఉన్నారని వారు పండించిన పంటను అమ్ము కునేందుకు విత్తనాలను కొనుక్కునేందుకు రైతు భరోసా నిధులు ఇప్పించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగేపు బొర్రన్న పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గత సెప్టెంబరు ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం కౌలు రైతులకు భరోసా నిధులు ఇస్తామని హామీనిచ్చారన్నారు. రైతులకు విద్యుత్ సరఫరా ఇప్పించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రైతులు భీమరాజు,శంకర్‌లతో పాల్గొన్నారు.